

బి.బి రాఘవులుతో 'సోమిరెడ్డి' భేటి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులును టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భేటి అయ్యారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా సోమిరెడ్డి కలిశారు. ఇద్దరూ నాయకులు పలు విషయాలపై చర్చించుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, గతంలో జరిగిన ప్రజా పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఈ భేటీలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఉన్నారు.

బివి రాఘవులును కలిసిన ఎంఎల్ఎ సోమిరెడ్డి-చంద్రమోహన్‌రెడ్డి

అక్కడ..ఇక్కడ..అదే గోల..!

కూటమి ప్రభుత్వం, పార్టీ నేతలు, కార్యకర్తలు లాకొల్లేక, పీక్కోలేక సతమతమవుతున్నారు.. ఎన్నికల వరకు అందరూ కలిసి ఉన్నట్లు కనిపించినా ఎన్నికల తర్వాత టిడిపి, జనసేన పార్టీల నేతల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గు మంటుంది..జనసేనపార్టీలో విబేధాలు ముదిరి పాకాన పడ్డాయి..రెండు గ్రూపులుగా చీలిపోయి నువ్వా నేనా.. నువ్వెంత అంటూ రోడ్డున పడ్డారు..టిడిపిలోనూ విబేధాలు తీవ్రమవుతున్నాయి. కావలిలో సీరియస్‌గా సాగుతుండగా కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు నగరాల్లో చాపకిందనీరులా ఉన్నాయి.. జనసేన, టిడిపి నేతల ఫిర్యాదు చిట్టాలు సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వద్దకు చేరాయి. ఇద్దరు నేతలు ఏ నిర్ణయం తీసు కుంటారోనని నేతలు కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు..

- కూటమి పార్టీల్లో కుమ్ములాటలు
- అధినేతల వద్ద ఫిర్యాదుల చిట్టా
- చంద్రబాబు, పవన్ నిర్ణయం కోసం ఎదురుచూపు
- నేతలు, కార్యకర్తల అయోమయం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"ఏరు దాటే వరకు ఓడ మల్లన్న...ఏరు దాటాక బోడి మల్లన్న " అన్న చందంగా ఉందని కూటమి పార్టీలోని టిడిపి, జనసేన పార్టీ పరిస్థితి. ఎన్నికల ముందు వరకు అంతా కలిసి ఉన్నట్లు కనిపించినా ఎన్నికల తరువాత విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఇందుకు ఉదాహరణ కావలి నియోజకవర్గ టిడిపి. ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎంఎల్ఎ మాలేపాటి సుబ్బానాయుడు విభేదాలు ఇటీవల తీవ్రమైన విషయం తెలిసిందే. సుబ్బానాయుడు మృతి తరువాత బయటపడ్డాయి. ఇపుడు అక్కడ కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి, బీద కుటుంబం, అంటూ మూడు గ్రూపులుగా మారిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి మొత్తం వివరాలు అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్ వద్దకు చేరాయి. ఈనెల 19న ముఖ్యమంత్రి కావ్య కృష్ణారెడ్డి బాధితులకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ప్రధాని పుట్టపర్తిరాక, బీహార్ పర్యటన నేపథ్యంలో వారం రోజులు వాయిదా పడినట్లు తెలిసింది.

ఎప్పుడైనా పిలిచి మాట్లాడే అవకాశం ఉంది. ఎంఎల్ఏతో కలిసి నడిచే పరిస్థితి లేదంటూ మాలపాటి కుటుంబ సభ్యులు తెగేసి చెబుతున్నారు. ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఆ సామాజిక వర్గం తనతోనే ఉందనే భావన కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మాలేపాటి సామాజిక వర్గాన్ని తీసుకొచ్చి అంతా ఆయనతోనే ఉన్నట్లు ప్రచారం చేసుకున్నారు. మరో వైపు బీద సోదరులతోనూ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం కావలి సమస్యను ఎలా పరిష్కరిస్తుందోననే ఆసక్తి అందరిలో నెలకొంది.నెల్లూరు నగరంలోనూ ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివా సరావు నేతలను పిలిచి మాట్లాడారు. కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోనూ చాపకింద నీరులా విభేదాలు సాగుతున్నాయి. పార్టీలో నెలకొన్న విభేదాలను జిల్లా నాయకత్వం జోక్యం చేసుకొని సర్దుబాటుచేసే పరిస్థితుల్లో లేదు. అందుకే అధిష్టానం దృష్టి పెట్టింది..

జనసేనతో ముప్పతిప్పలు..!

జనసేన పార్టీ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎన్నికల తరువాత రెండు గ్రూపులుగా చీలిపోయి దాడుల వరకు చేరారు. ఇక్కడ మంత్రి నాదెండ్ల మనోహర్, వేములపాటి అజయ్ కుమార్ గ్రూపులుగా నేతలు, కార్యకర్తలు మారారు. రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవిలో ఉన్న అజయ్‌కుమార్ జిల్లాలో తిరుగుతూ పార్టీ కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ఇందులో మనో హర్ గ్రూప్ సభ్యులను కలుపుకోవడం లేదని ఇటీవల మీడియా ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. విషయం పెద్దగా కావడంతో ఆపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నేతలను విజయవాడ పిలిచి మాట్లాడారు. పార్టీని బజారుపాలు చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు. నెల్లూరు జిల్లాలోని పార్టీలో ఏం జరుగు తుందో తెలుసుకోడానికి పార్టీ నేత శివశంకర్‌ను నియమించగా, కొద్ది రోజుల క్రితం ఆయన ఇక్కడ పర్యటించారు. అన్ని విషయాలను పవన్‌కళ్యాణ్‌కు నివేదిక ఇచ్చారని తెలిసింది. జనసేన పార్టీ జిల్లా నాయకత్వాన్ని నియమించుకునే పరిస్థితుల్లోనూ లేదు. ఎన్నికలకు ముందు, ఇపుడు వరకు ఆపార్టీకి నాయకత్వమే లేకుండా పోయింది. పవన్ కళ్యాణ్ అందుకోసం ప్రయత్నాలు చేయడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే రెండు సార్లు ఆపార్టీ కార్యాలయం వద్ద దాడులు చేసుకున్న పరిస్థితులున్నాయి. అంతంత మాత్రంగా ఉన్న జనసేన పార్టీలో విభేదాలు నేతలు, కార్యకర్తలను అయోమయంలో పడేశాయి. నెల్లూరుజిల్లాకు సంబంధించి టిడిపి, జనసేన పార్టీ నేతల మధ్య విభేదాలు ఇద్దరు నేతల టేబుళ్ల వద్దకు చేరాయి. ఏ నిర్ణయం తీసుకుంటారు. ఏం చేస్తారో చూడాలి.

మీడియాతో మాట్లాడుతున్న బివి రాఘవులు, పక్కన మూలం రమేష్

'సంజీవిని' రహస్యాలు బయటపెట్టండి..

- ప్రజల ఆరోగ్యం కార్పొరేట్‌కు అప్పగిస్తారా..?
- 26న కార్మిక సమ్మెను జయప్రదం చేయండి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సంజీవిని పథకం గేమ్ ఛేంజర్ అని సిఎం చెబుతున్నారని, ఏం చేస్తున్నారో రహస్యాలు బయటపెట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సంజీవని ఏదో అద్భుతంగా చెబుతున్నారని, ఆ పథక వివరాలు ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. టాటా, బిల్ గేట్స్ ముఖ్యమైన పాత్ర ఉందని చెప్పారని, వాస్తవాలు బయట పెట్టాలన్నారు. డిజిటల్ కార్డులను అమలు చేస్తామని చెబుతున్నారని, చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారని, ఆ కార్డులు ఎవరు తీసుకుంటారు ఎవరు వినియోగించుకుంటారు. ప్రజలు ఆరోగ్య వివరాలు కార్పొరేట్ శక్తులకు ఎలా ఉపయోగపడతాయో చూడాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను అమల్లోకి తీసుకోడానికి సిద్ధమైందని సిపిఎం కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీహార్ ఎన్నికల వరకు ఆగినంగా ఉన్న ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన వెంటనే తన కుట్రను బయటపెట్టిందన్నారు. కార్మిక చట్టాలు దుర్మార్గమైనవని, కార్మికుల హక్కులు, వేతనాలు, పనిగంటలు, నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ చట్టాలు గొప్పవని ప్రధాని చెబుతున్నారని, ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేకపోయారో చెప్పాలన్నారు. కార్మిక సంఘాలు ఎందుకు సమ్మె చేశాయని, జులైలో జరిగిన సమ్మెలో 25 కోట్ల మంది ఎందుకు పాల్గొన్నారని, కార్మికులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలన్నారు. ఈనెల 26న కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు దేశవ్యాపితంగా ఆందోళనలు చేపట్టాయన్నారు. ఈ ఆందోళనకు సిపిఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. వెంటనే ఈ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రయోజనం కలిగించే అంశాలు తీసుకురావాలంటే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలన్నారు. కార్పొరేట్, ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కై వారికి మేలుచేసేలా చట్టాలు తీసుకురావడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్య శాఖను సమీక్ష చేశారని, అందులో ప్రయివేటు మెడికల్ కాలేజీలను గత ప్రభుత్వం ప్రారంభించిందని, ఇప్పుడు వాటిని పిపిపి పద్ధతిలో ప్రయివేటు వారికి ధారాదత్తం చేయాలని నిర్ణయం తీసుకుంటున్నారు. గత ప్రభుత్వమే ఈ ప్రతిపాదనలు ప్రారంభించిందని, రోజు వైసిపిపై విమర్శలు చేసే చంద్రబాబు వారి చేసిన పనులు అమలు చేయడం ఏమిటన్నారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలన్నారు. పది కాలేజీల్లో ఏవి వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం నిర్వహించకపోతే వెనుక బడిన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయన్నారు. పరిపాలనా, శ్రమ చేసే వారిని అవమానకరంగా మాట్లాడుతున్నారని, స్టీల్ ప్లాంట్ కార్మికుల గురించి మాట్లాడని, లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తున్నారని, కార్మికులు పనిచేయకపోతే అది ఎలా సాధ్యమైందన్నారు. వాస్తవంగా అక్కడ లోపాలు జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలనే అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఒక్క ఘని ఇవ్వలేదని, ప్రయివేటు వ్యక్తులు మాత్రం ఇస్తున్నారన్నారు. విశాఖ ఎస్ఆర్ స్టీల్ ప్లాంట్‌కు ఘని ఇచ్చారని, పక్కనే ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇవ్వలేదన్నారు. బొగ్గు రవాణా చేసుకోడానికి ఓడలు ఇవ్వలేదన్నారు. అదానికి పోర్టులు కట్టబెట్టారన్నారు. ప్రభుత్వమే పథకం ప్రకారం స్టీట్ ప్లాంట్‌ను దెబ్బతీస్తూ, కార్మికుల గురించి మాట్లాడం సరికాదన్నారు. డాక్టర్లు గురించి ముఖ్య మంత్రి తక్కువగా మాట్లాడు తున్నారని, ప్రాణమున్న డాక్టర్లు కన్నా ప్రాణం లేని ఏఐ గొప్పగా పని చేస్తుందని చెప్పడం అవివేకమన్నారు. సిఎం నుంచే పేదరిక నిర్మూలన ప్రారంభం చేయాలన్నారు. ఎవరు డాక్టర్లను ఇంటికి పంపి ఎఐ ద్వారా వైద్యం చేయించుకోవాలన్నారు. కంప్యూటర్ చేసే వైద్యం మనుషులకన్నా గొప్పది కాదన్నారు. టెక్నాలజీ ఎక్కువ ఆధారపడడం మంచిది కాదని ప్రపంచంలోని మేధావులు చెబుతున్నారన్నారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు సిపిఎం వ్యతిరేకమన్నారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలను నక్సల్స్ పేరు చేసిన సమయంలోనూ వారిని ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేస్తే తమ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కగార్ పేరుతో కేంద్రం హత్య చేస్తుందని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం నక్సల్‌తో చర్చలు జరిపి ఇలా హత్యలు చేయడం మంచిది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేసి, చిత్రహింసలు చేసి, హత్య చేయడం సరైంది కాదన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లు నిలుపుదల చేయాలన్నారు. అరెస్ట్ చేసి కేసులు పెట్టి చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. సిఐఐ సమ్మిట్‌లో లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారని, ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనువైన పరిస్థితులు కల్పించాలని, అలా కాకుండా భూములు ఇవ్వడానికి ఎక్కువ శ్రద్ధ చూపుతోందని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం లేదన్నారు. సమ్మిట్ వల్ల విస్తారమైన ప్రయోజనం రావాలి, పరిమితమైన మార్గమేర్పాటు. పెట్టుబడులు ఉపాధి సృష్టించే రంగాల్లో రావాలని అప్పుడే అందరికీ ఉపయో గమన్నారు. అమెరికా ఆంక్షలపై పోరాటం చేయ కుండా ఏ పరిశ్రమలు వస్తాయని ప్రశ్నిం చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే..!

కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : లేబర్ కోడ్లను అమలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కుతీసుకోవాలి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలులోకి తీసుకొస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కార్మికుల హక్కులను హరించేటటువంటి ఈ లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నగరంలో గాంధీబొమ్మ సెంటర్‌లో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాలు పాల్గొని కార్మికుల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. లేబర్ కోడ్స్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్ ,ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు యానాదయ్య మాట్లాడారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఇప్పటికే దేశ వ్యాప్తంగా కార్మికులు పలుమార్లు దశల వారీ పోరాటాలు చేపట్టాయన్నారు. ఈ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా ముద్దు నిద్రపోతుం దన్నారు. ఆధునీకరణ పేరుతో కార్మికుల నడ్డి విరిచే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను రూపొందించి అమలు చేసేందుకే కుటిల ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు.ఈ లేబర్ కోడ్ల వల్ల చిన్న చిన్న కారణాలు చూపించి కార్మికులను పరిశ్రమల యాజమాన్యం విధుల నుంచి తొలగించొచ్చన్నారు. లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీ ప్రసాద్,కే పెంచల నరసయ్య,ఆటో యూనియన్ నాయకులు సుధాకర్,రాజా సురేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జిలాని పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మున్సిపల్ కార్మికులకు సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు :కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనకు భవన నిర్మాణ కార్మిక సంఘం, ఎఆర్‌టి డబ్ల్యూఎఫ్ నాయకులు హాజరై తమ సంఘీభావం ప్రకటించారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్గ్రేషియా చెల్లిం చాలని కోరుతూ నెల్లూరు నగరపాలక సంస్థ వద్ద కొనసాగుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆం దోళన 19వ రోజుకు చేరుకుంది. భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి ఎస్కే ఖలీల్, ఏ. ఆర్. టి. డబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి కే. సురేష్, నాగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. అధికారులు స్పందించి, మున్సిపల్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే. పెంచల నరసయ్య, సుజాతమ్మ, వజ్రమ్మ, సునీల్, దేశ మూర్తి చెన్నయ్య, లోకేష్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వాలీబాల్ జట్టు ఎంపిక

కందుకూరు :ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్-14 వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో కందుకూరు బాయ్స్ హైస్కూల్ నుంచి 8మంది విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.ఈ క్రీడాకారులు మదనపల్లిలో ఈనెల 24,25,26 తేదీల్లోజరిగే 69వ ఎస్‌జియఫ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. శనివారం జరిగిన అభినందన సభలో హెచ్ఎం నరసింహ మూర్తి మాట్లాడారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం. రమణయ్య, స్టాఫ్ సెక్రటరీ: చిత్తారు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు యు. సుబ్రహ్మణ్యం, మెండా నరసింహం ఉన్నారు.

నదిలో చిక్కుకున్న ఆరుగురు సురక్షితం

ఒడ్డుకు చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

జిల్లాలోని ఆత్మకూరు మండలం, అప్పారావుపాలెం గ్రామస్తులు పశువులు మేపుకోవడానికి ఆరుగురు పశువుల కాపర్లు ఒక్కసారిగా నీళ్ల అధికంగా రావడంతో పెన్నా నదిలో చిక్కుకున్నారు.పోలీసుల వివరాల మేరకు.. శనివారం ఉదయం అప్పారావు పాలెం నుంచి పశువులు మేపుకునేందుకు పెన్నా నదిలోకి వెళ్లిన పశువుల కాపర్లు.. పశువులు మేపుకోవడానికి వెళ్లి తిరిగి వస్తూ ఒకసారిగా వచ్చిన నీటి ప్రవాహంతో మధ్యలో చిక్కుకున్నారు.వెంటనే ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐ సాయి ప్రసాద్ , సంగం ఎస్ఐ రాజేష్‌లు తమ సిబ్బందితో కలిసి సకాలంలో స్పందించి రంగంలోకి దిగి పశువుల కాపరులను ఒడ్డుకు చేర్చారు.

నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులోని ఎస్‌సి హాస్టల్‌కు పోయే రహదారులన్నీ వర్షపు నీరుతో నిండిపోవడంతో హాస్టల్‌కు వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. శనివారం వేకువ జామున కురిసిన వర్షానికి హాస్టల్ రహదారి మోకాటి లోతు నీటితో నిండిపోయింది. స్థానిక గ్రంథాలయం దగ్గర నుంచి మిట్ట పాలెం వెళ్లే రహదారిలో ఉన్న హాస్టల్ భవనాన్ని చేరుకోవాలంటే ఆ రహదారంతా గుంతలు, మిట్టలుగా ఉంది. ఇప్పటికైనా హాస్టల్ రహదారిలో ఏర్పడిన గుంతలు పూడ్చివేసి వర్షపు తొలగించాలని కోరుతున్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి -ఉలవపాడు : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఉలవపాడు మండల వైసిపి ఆధ్వర్యంలో శనివారం పెదపట్టపాలెం గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించరు. ఉలవపాడు వైసిపి మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర నాయకులు తోట మల్లికార్జున, జిల్లా నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, నియోజకవర్గ నాయకులు పాలవల్లి అమర్నాథ్ రెడ్డి, మండల నాయుకులు చేజర్ల వెంకటరామిరెడ్డి మానం సుబ్బారావు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల చిన్న సోమయ్య మాజీ సర్పంచ్ ఆవుల జయరాం పుల్ల హరిబాబు చిన్ని చిన్న గోవిందు ఆవుల అనిల్ కే ముత్యాలు పాల్గొన్నారు.

'మాలకొండ' ఆదాయం రూ.11.67 లక్షలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.11,67,843 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ మార్గాల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మోటర్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలయిన సంఘటన మండలంలోని రోళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఆ ప్రమాదంలో మండలంలోని జమీన్ ఉప్పలపాడు గ్రామానికి చెందిన సోమినేని సింహాద్రికి తీవ్ర గాయాల య్యాయి.సింహాద్రి బైక్‌పై రోళ్లపాడు నుంచి జమీన్ ఉప్పలపాడు వెళ్లేందుకు జాతీయ రహదారి ఎక్కుతుండగా కందుకూరు నుంచి వలేటివారిపాలెం వెళ్తున్న ప్రయివేటు బస్సు తగిలింది.ఈ ప్రమాదంలో సింహాద్రి తల, కాళ్లు, చేతులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి.

శ్రీనివాసులుకు నివాళి

ప్రజాశక్తి- కందుకూరు : మండలం బలిజిపాలెం గ్రామానికి చెందిన టిడిపి ఎస్సీ సెల్ నాయకుడు దార శ్రీనివాసులు శనివారం ఉదయం గుండెపోటుతో మతి చెందారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వం`రావు బలిజిపాలెం గ్రామంలో దార్ల శ్రీనివాసులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర`మంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, పార్టీ నాయకులు టి రామకష్ణ, ఏకాంబరం వెంకట్రావు, ఏకాంబరం నాగేశ్వరరావు ఉన్నారు.



అంకమ్మ దేవాలయం వద్ద ఉద్రిక్తత

గదుల నిర్మాణం అడ్డుకున్న శివరాం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శ్రీ అంకమ్మ దేవాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణం చెయ్యొద్దంటూ మాజీ ఎంఎల్ఎ డాక్టర్ దివి శివరాం శనివారం భీష్మించారు.. అంకమ్మ దేవాలయం కందుకూరు పట్టణ నడిబొడ్డున ఉంది. వ్యాపార కూడలిగా ఉన్న ఈ ప్రాంతంలోనే దేవాలయానికి స్థలం ఉండడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. మొదటి దశ నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే కొందరు వ్యక్తులు గదుల నిర్మాణం చేయకుండా నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టుని ఆశ్రయించారు. ఆ సమయంలో హైకోర్టు స్టే విధించడంతో గదుల నిర్మాణం దాదాపు మూడు నెలలపాటు నిలిచిపోయింది. కోర్టు ఆర్డర్ గదల నిర్మాణానికి అనుకూల వాతావరణ కల్పించడంతో మొదటి దశ గల నిర్మాణం పూర్తయింది. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్ గదులను ప్రారంభిం చారు. మిగిలిన గదులు నిర్మాణం చేపడుతున్న సమయంలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం దేవాలయ ఆవరణలో ఉన్న చెట్లను తొలగిస్తే బాగుండదని, దేవుడి చెట్టని చెప్పారు. చెట్లను తొలగించకుండా అడ్డుకున్నారు. గదుల నిర్మాణం పూర్తిగా ఆపివేయాలని అడ్డుకున్నారు. అంకమ్మ దేవాలయం కార్య నిర్వహణ అధికారి కార్తీక్ పోలీసులను ఆశ్రయించాడు.కాంప్లెక్స్ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు భారీగా మోహరించారు. కందుకూరు సిఐ అన్వర్ భాష ఆధ్వర్యంలో పోలీసులు నిర్మాణ పనులను అడ్డుకుంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా ఏదో జరుగుతుందనే ఉద్రిక్తత నెలకొంది. నిర్మాణ పనులు చేస్తే అంకమ్మ తల్లి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని శివరాం హెచ్చరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివరాం దేవాలయం వద్ద తిష్ట వేసి కూర్చున్నారు.దీంతో నిర్మాణ పనులు శనివారం ముందుకు సాగలేదు.

గదుల నిర్మాణ పనులను అడ్డుకుంటున్నదివి శివరాం

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు :తాను ఎంఎల్ఏగా విజయం సాధించడంలో కీలకపాత్ర వహించిన ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అన్ని విధాలా కట్టుబడి ఉన్నామని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇమామ్, మోసాన్‌లకు 90 కోట్ల రూపాయల గౌరవ వేతనం విడుదల చేసిన నేపథ్యంలో, కందుకూరు నియోజకవర్గానికి చెందిన ముస్లిం సోదరులు, మత పెద్దలు ఎంఎల్ఎ నాగేశ్వరావును కందుకూరు టిడిపి కార్యాలయంలో శనివారం కలిసి సన్మానించారు. ఎంఎల్ఎ నాగేశ్వరావు మాట్లాడుతూ ఇమామ్, మోసాన్ లకు గౌరవ వేతనం ఇచ్చే కార్యక్ర మాన్ని 2014లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమల్లోకి తెచ్చారని గుర్తు చేశారు. కందుకూరులో తాను విజయం సాధించడంలో మైనార్టీ సోదరులందరూ ఎంతో కష్టపడ్డారని, వారిని తాను ఎప్పుడు మరిచిపోనని ఎంఎల్ఎ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏ ముస్లిం సోదరుడు వచ్చినా, ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం సిఫార్సు చేస్తున్నారని చెప్పారు, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భాషా, పార్టీ నాయకులు షేక్ రూబీ, షేక్ మున్నా, షేక్ సలాం, షేక్ ఫిరోజ్, ముస్లిం మైనార్టీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ నశీర్,షేక్ ఖాదర్బాషా, జియవుద్దీన్,సయ్యద్ మూస, సయ్యద్ అస్మతుల్లా, షేక్ సలీం, షేక్ గౌస్ బాషా, సయ్యద్ ముస్తాక్, షేక్ సుభాని,గౌస్ బాషా, భాష,ఖుదుస్, సయ్యద్ జహీర్, హఫీజ్,నాయబ్ రసూల్,షేక్ నజీర్ భాష, కాలేశా,షేక్ రఫీ, షేక్ వలిభాష, ఆరిఫ్, రహమ తుల్లా,అన్ని మసీదుల అధ్యక్షులు, ఇమామ్, మౌజన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ఆక్రమణ చెరలో ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న విలువైన ప్రభుత్వ కుంటను అక్రమిం చడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఆనందపురం రోడ్డులోని రోడ్డుకి అనుకొని ఉన్న ప్రభుత్వ కుంటను క్రమక్రమంగా పూడ్చివేస్తూ ఆక్రమణదారులు సొంతం చేసు కోవడానికి ప్రయత్నిస్తున్నారు. విలువైన ఈ కుంట స్థలాన్ని కొందరు వ్యక్తులు కొద్దిరోజులుగా పూడ్చి వేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ కుంట ఉన్న ప్రాంతంలో పట్టణం లోని కొన్ని ప్రాంతాల ప్రజలు కర్మకాండలకు ఉపయోగిస్తుంటారు. పట్టణం విస్తరించడంతో ఈ కుంట స్థలం విలువైందిగా మారింది. దీంతో ఆక్రమణ దారుల కన్ను కుంటపై పడింది. ఇప్పటికే కుంటను పూడ్చటం పూర్తి చేసి దానిలో ఉన్న చెట్లు చెత్తను తొలగించడం ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు దీనిని కాపాడకపోతే పరులపాలు అవుతోంది. దాదాపు ఈ కుంట స్థలం కోట్ల రూపాయల విలువ చేస్తుందని అంచనా.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ కంట స్థలం

ప్రజాశక్తి వార్తకు వివరణ

ప్రజాశక్తి నెల్లూరు ప్రతినిధి

అక్టోబర్ 17వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో కళాశాలలా మృత్యు కూపాల అనే శీర్షికతో వార్త ప్రచురణమైంది. గత నాలుగు నెలల్లో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారని, దీనిలో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థి కూడా చనిపోయినట్లు ప్రచురించారు. తమ మెడికల్ కళాశాలలో ఇటీవల కాలంలో ఏ విద్యార్థి మృతి చెందలేదని నెల్లూరు నారాయణ కళాశాల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులు రెడ్డి ప్రజాశక్తికి వివరణ ఇచ్చారు.

ఎన్‌సిసి సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2023- 25 ఎన్‌సిసి డిపార్ట్మెంట్ కు సంబంధించి' ఎ 'సర్టిఫికెట్ పంపిణీ విజయవంతంగా శనివారం జరిగింది. ఇక్కడ ఎన్‌సిసి డిపార్ట్మెంట్ 34 ఆంధ్ర బెటాలియన్ ఒంగోలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 2023- 25 బ్యాచ్ కి సంబంధించి 37 మంది కాడేట్స్ పరీక్షకు హాజరయ్యారు. 37 మందిలో 37 మంది ఎ గ్రేడ్ తో పాసయ్యారని హెడ్మాస్టర్ ఎం. నరసింహమూర్తి తెలిపారు34 ఆంధ్ర బెటాలియన్ ఒంగోలు నుండి హవాల్దర్ జస్పాల్ సింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు ఎం నరసింహమూర్తి ,ఎన్‌సిసి కేర్ టేకర డబ్బుగొట్టు సుధాకర్ రావు .పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్. ఎం రమణయ్య,పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ చిత్తారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయంలో శనివారం రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించుట జరిగినదికందుకూరు ప్రాంతీయ రమణా శాఖ అధికారి టీవీయన్ లక్ష్మీ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ప్రతి పౌరుడు యొక్క ముఖ్యమైన బాధ్యత అన్నారు. రహదారి భద్రత నియమాలను తూచా తప్పకుండా పాటించితే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెపారు. ముఖ్యంగా బైక్ నడిపే వాళ్ళు ఓవర్ స్పీడ్ చేయవద్దని డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న తర్వాతే వాహనాలను నడుపపాలన్నారు.కందుకూరు ఎంవిఐ జె అనిల్ కుమార్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌టిఒ టివిఎస్ లక్ష్మీ

స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లూరు :పురుషులల్లో 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరు ప్రోస్టేట్ గ్రంధికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని మెడికవర్ వైద్యులు డాక్టరు గోకుల్ నచికేత్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్ ప్రోస్టేట్ విస్తరణ పై అవగాహన కల్పించారు. పురుషుల్లో 40 ఏళ్ల వయసు తర్వాత ప్రోస్టేట్ గ్రంధి క్రమంగా పెద్దదవుతూ, మూత్ర విసర్జన సమస్యలు, తరచూ మూత్రం రావడం వంటి లక్షణాలు కనబడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్‌లో అధునాతన యూరాలజీ సేవలు, లేజర్ ప్రోస్టేట్ సర్జరీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అధ్వానంగా సచివాలయ రహదారి

ప్రజాశక్తి-జలదంకి : మండల కేంద్రమైన జలదంకి సచివాలయ రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగున గుంతలతో అధ్వాన్నంగా ఉంది. రోడ్డంతా గుంతలు తేలి బురదమయంగా మారింది. ఈ రోడ్డు చూసేందుకు నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతు పొలంలా ఉందని ప్రజలంటున్నారు. ప్రధాన గ్రామానికి దక్షిణాన హరిజనవాడ అరుంధతీయవాడలకు మధ్యన సచివాలయం ఏర్పాటు అయింది. జలదంకి పంచాయతీకి గమళ్లపాలెం బిలకారపాలెం నెహ్రూ నగర్ కాలనీ కమ్మపాలెం నాగిరెడ్డి పాలెం మజరా గ్రామాలుగా ఉన్నాయి. నిత్యం వివిధ రకాల పనుల మీద ఈ సచివాలయానికి ఇక్కడ ప్రజలు వస్తుంటారు. ఈ గ్రామాలతో పాటు మండలంలోని అన్నిగ్రామాల ప్రజల చిన్నారులకు ఆధార్ అప్డేట్ తదితర పనుల కోసం వస్తుంటారు. ఈ మార్గంలో నడవాలన్న ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్న నరకయాతన పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఎక్కడ జారిపడతామని పాదచారులు, ఏ గుంతలో పడి వాహనం బోల్తా పడుతుందోనని వాహనదారులు హడలిపోతున్నారు. ఈ రోడ్డు పావు కిలోమీటర్ మేరా పెద్దపెద్ద గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిస్తే వర్షం నీరంతా గుంటల్లో చేరి రోడ్డు ప్రమాదకరంగా తయారవుతుందంటున్నారు. బురదనీరు కారణంగా గుంతలు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా ప్రయాణం సాగించాలంటే ప్రయాసాలకు గురవుతున్నారు. ఈ రహదారిపై పాదచారులకు జారిపడి అవస్థలు పడుతుండగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలు గురవుతున్నారు. సచివాలయానికి తూర్పు వైపున ఉన్న అరుంధతీయ కాలనీవాసులు తోపాటు ప్రధాన గ్రామానికి చెందిన కొంతమంది ఈ మార్గం గుండానే బయటకు ఇతర ప్రాంతాలకు వెళ్ళి ఉంది. ఈ సచివాలయానికి కూతవేటు దూరంలో హరిజనవాడకు పడమటి వైపు కేయూర్ రోడ్డు మీద బస్‌షెల్టర్ ఉంది. కూలి పనులకు ఇతర పనులకు వెళ్లాలంటే ఈ మార్గం గుండా అరుంధతీయకాలనీ ప్రజలతోపాటు ప్రధాన గ్రామానికి చెందిన కొంతమందికి ఇదే ప్రధానమైన రహదారి. ఈ మార్గం గుండ తెల్లవారుజామున మసక చీకటిలో అరుంధతీయ కాలనీవాసులు కూలి పనులకు వెళ్ళాల్సి ఉంది. పని ఒత్తిడితో హడావిడిగా వెళ్తే కూలీలు ఈ ప్రాంతంలో జారిపడి గాయాల పాలవుతున్నారు. ముఖ్యంగా సచివాలయ అధికారులతో పాటు మండల కేంద్రంలోని అధికారులంతా వివిధ పనుల మీద జలదంకి సచివాలయానికి వచ్చిపోతుంటారు. జలదంకి కురిసిన మోంథా తుపాన్ వర్షాలవల్ల అతుకుల గతుకులూ అంతంత మాత్రంగా ఉన్న ఈ దారి పూర్తిగా దెబ్బతింది. ముఖ్యమైన రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు చెప్తుంది. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమైన అధ్వానంగా తయారైన సచివాలయ రహదారిపై పాదచారులకు వాహనదారులకు ఇన్ని అవస్థలు ఎదుర్కొంటున్నా పంచాయతీ అధికారులు పాలకులకు చీమకుట్టినట్లుగా లేకపోవడం విశేషం. ఉన్నతాధికారులైన ఈ రహదారిపై పడుతున్న పాట్లపై స్పందించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు పెడచెవిన పెట్టి తమ ఆగడాలపై అల్పంగా ఉన్న పంచాయతీ కార్యదర్శి పాలకులకు అక్షంతలు వేయాలని ప్రజా ప్రతినిధులను ఉన్నతాధికారులను ప్రజలు అభ్యర్థిస్తున్నారు. ఈ రహదారికి మరమ్మతులు పూర్తయ్యే వరకు ఈ రోడ్డుపై జర జాగ్రత్త అనే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానవత్వం చాటిన పొన్నలూరు తహశీల్దారు

ప్రజాశక్తి-కలిగిరి : అక్టోబర్‌లో తెల్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కలిగిరి మండలం దుబగుంట గ్రామానికి చెందిన బాబు మమత బిగి అను ముగ్గురు మరణించారు. కేవలం ఒక పాప మేఘన మాత్రమే బతికి ఉంది. తీవ్ర గాయాలతో మేఘన ప్రాణాలతో బయటపడింది. ఈ విషయం దినపత్రికలో చూసిన ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం తహశీల్దారు బి.పుల్లారావు మానవతా దృక్పథంతో స్పందించి వారి వీఆర్ఓ షేక్.కాజాబీ ద్వారా కలిగిరి మండలం తూర్పు దుబగుంట గ్రామానికి పంపించి మేఘన వారి ఇంటికి వెళ్లి పరామర్శించి గాయాలపాలై చికిత్స పొంది ఇప్పటికే కోలుకుంటున్న మేఘనకు దుస్తులు నిత్యావసర వస్తువులు తినుబండారాలు కొంత మొత్తంలో నగదు రూ.12వేలు విలువగల సామగ్రిని వీఆర్ఓ షేక్ కాజాబీ ద్వారా కుటుంబానికి అందజేశారు. ఈ దాతృత్వం చేసిన పొన్నలూరు తహశీల్దార్ పుల్లారావు మానవత్వాన్ని చాటుకున్నారు. సహాయం అందించినందుకు వారికి ఎస్‌ఐ బి.శివకుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-మర్రిపాడు : సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ గోపినాథ్ సూచించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, చలి తీవ్రత పెరిగి తేమ శాతం ఎక్కువగా ఉన్నందున దోమలు చేరి వైరల్ ఫీవర్స్, డెంగ్ జ్వరాలు, అలర్జీ, జలుబు, దగ్గు ఆస్తమా లాంటివి వస్తాయన్నారు. కావున ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు లేకుండా జాగ్రత్త పాటించాలని, దోమతెరలను వాడాలని, ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు.

కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలస్థాయి సెకండ్ గ్రేడ్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను ఆత్మకూరు డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి జానకిరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఇంతకుముందు సెకండ్ గ్రేడ్ సమావేశాలు క్లస్టర్‌స్థాయిలో జరుగుతూ ఉండేవని ప్రస్తుతం మండలస్థాయిలో సెకండ్ గ్రేడ్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు జరపడం వల్ల ఉపాధ్యాయులు బోధనలో తమతమ అనుభవాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకోవడంతోపాటు విద్యార్థులకు సులువుగా ఏ విధంగా బోధించాలనే బోధన పద్ధతులపై కూడా సమగ్ర అవగాహన పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశాలు విజ్ఞాన భాండాగారాలుగా తయారవుతాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు టి.వెంకటేశ్వర్లు, తోటా శ్రీనివాసులు, క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-మర్రిపాడు : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిసిపల్లి టోల్ ప్లాజా వద్ద ఎస్‌ఐ శ్రీనివాసరావు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలలో ఎక్కువమందిని తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కూలీలతో వెళ్తున్న ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం వల్ల లారీ ఢీ కొట్టడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిపారు. ఇటువంటి ప్రయాణాలు చేయడం నేరమని, అధిక లోడుతో వెళ్తున్న ఆటోలపై కేసులు పెట్టి ఛార్జ్‌షీట్ ఫైల్ చేశామని తెలిపారు. ప్రత్యేక మేజిస్ట్రేట్ శిక్ష రూ.1000, రూ.500 అపరాధ రుసుము విధించారని తెలిపారు. వీరికి ఉదయం 9గంటలు నుండి సాయంత్రం 5గంటలు వరకు హైవేపై ప్లకార్డులతో వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇలా చేయకపోతే ఒక నెల జైలు శిక్ష విధిస్తామని మేజిస్ట్రేట్ తెలిపారు. రహదారి భద్రతలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట శాఖా గ్రంథాలయం వారి ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.రుక్మిణి బహుమతులు అందజేశారు. చిత్రలేఖనం సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి కె.సంజన, జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి జె.వర్షిని, దేశభక్తి గీతాల్లో ప్రథమ బహుమతి పి.హబీబున్నీసా గెలుపొందారు. అనంతరం లైబ్రేరియన్ ఒ.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షల మెటీరియల్‌తో పాటు, విజ్ఞానదాయక వినోదాత్మక, నైతిక విలువలు పెంపొందించే బాల సాహిత్యం జీవిత చరిత్రలు, దిన వారపత్రికలు మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ లైబ్రేరియన్ కె.ప్రసన్న, ఆంగ్ల ఉపాధ్యాయులు డి.ప్రసాద్, నాణేల సేకరణకర్త ఎం.డి. వాయిజ్, టి.డి.ఓ. నిర్వాహకులు ఇ.వి. చలపతిరావు, విద్యార్థులు కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

పున్నూరులో రైతు సదస్సు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని పున్నూరు గ్రామంలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన - కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. స్థానిక రైతులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు పార్లమెంటరీ కార్యదర్శి పార్లమెంటు కోఆర్డినేటర్ శ్రీనివాసులు ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వ్యవసాయ నిపుణులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి..

పలుచోట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నిరసనలు

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు శనివారం నిరసనలు వ్యక్తం చేశాయి. ఈ 4 లేబర్ కోడ్ విధానాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించి, పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడానికి మాత్రమే బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని మరోసారి తేటతెల్లమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై చేస్తూ ఆందోళన చేపట్టారు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కొండమూరు హజరత్తయ్య, మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ 2019లో వేతన కోడ్ అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకున్న పుడు కార్మికులు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. 2020 జనవరిలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్‌లను చట్ట రూపంలోకి తెచ్చారన్నారు. కార్మిక వర్గం 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నవంబర్ 26(2024) కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చలో ఢిల్లీతో పాటు చారిత్రాత్మక సమ్మెను నిర్వహించింద న్నారు. తాజాగా జూలై 9 2025న సుమారు 25కోట్ల మంది కార్మికులు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరిపి తమ నిరసన తెలియజేశారన్నారు. కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక బడ్జెట్ సంప్రదింపుల సమావేశంలో కార్మిక కోడ్‌లను రద్దుచేసి భారత కార్మిక సదస్సు నిర్వహించాలని కోరిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల విజ్ఞప్తులను పెడచెవిని పెట్టి మొండిగా కార్మిక వ్యతిరేక యాజమాన్య అనుకూల లేబర్ కోడ్లను అమలు చేయడాన్ని నిరసిస్తూ భవిష్యత్తులో లేబర్ కోడ్‌లను రద్దు చేసేదాకా కార్మిక వర్గం పోరాడుతుందని తెలియజేశారు. అనంతరం లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయ కులు హెచ్.మురళీకృష్ణ, యుఇఐయు నాయ కులు టి.పెంచల రావు, కె.ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకు రాలు పి.రాధమ్మ, ఆశవర్కర్ సీనియర్ నాయకురాలు షేక్.మహబూబ్ జాని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆత్మకూరు డిపో అధ్యక్షులు భాస్కర్, ఎల్ఐసి యూనియన్ నాయకులు రమేష్, సీనియర్ నాయకులు సిద్ధయ్య, తదితరులున్నారు.

ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలు కోసమే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని జిల్లా సిఐటియు కార్యదర్శి గడ్డం అంకయ్య విమర్శించారు. జిల్లా కమిటీ పిలుపుమేరకు ముత్తుకూరు మండల కేంద్రంలో శనివారం ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ వద్ద నాలుగు లేబర్ కోడ్ల ఉత్తర్వుల కాగితాలను కార్మికుల సమక్షంలో అగ్నికి ఆహుతి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నోటిపై చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా సిఐటియు కమిటీ పిలుపుమేరకు ఉత్తర్వుల కాగితాలు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. కార్మిక సంఘాల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని జిల్లా సిఐటియు కార్యదర్శి గడ్డం విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నక్కా రాధయ్య, కార్మిక సంఘం నాయకులు చేవూరు మల్లికార్జున, నెల్లూరు వెంకటేశ్వర్లు, ఎస్ మస్తానయ్య, సి.హెచ్ మణి, బి.శ్రీనివాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గుడినరవ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలిస్తూ 4, 5 తరగతుల విద్యార్థులు గణిత విషయంలోని చతుర్విధ ప్రక్రియలు సాధించే విధంగా బోధన చేయాలని సూచించారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు సులువుగా చతుర్విధ ప్రక్రియలు ఏ విధంగా సాధించాలనే విషయాన్ని నల్లబల్లపై విశదీకరించారు. విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయికి తగ్గట్టుగా ఉన్నవని ప్రధానోపాధ్యాయురాలు వై.శారదను ఉపాధ్యాయురాలు షేక్ హబీబున్నిసాను అభినందించారు. అలాగే గణిత విషయంలో ప్రతిభ చూపించిన నాలుగో తరగతి విద్యార్థి కెవిన్ ను అభినందించి 3,4,5 తరగతుల విద్యార్థులకు చదవడం రాయడం చతుర్విధ ప్రక్రియలు తప్పనిసరిగా వచ్చి ఉండాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వాహనచోదకులు మద్యం సేవించి వాహనాలు నడిపితే అపరాధ రుసుముతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు గత వారంరోజుల వ్యవధిలో ఆత్మకూరు పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారికి రూ.10వేలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడితపితే జరిమానా లేదా మూడు రోజులు జైలుశిక్ష పడుతుందన్నారు.

కేక్‌ను తినిపించుకుంటున్న టిడిపి నేతలు

ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినోత్సవం సేవా కార్యక్రమాలు శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టిడిపి నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సంబరాల్లో భాగమయ్యారు. మైపాడు బీచ్‌లో మత్స్యకారులు పడవలపై బాణాసంచా కాల్చి వేడుకలకు శోభనిచ్చారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని పామంజి నరసింహ, మాజీ చైర్మన్ కనుపూరు సురేంద్ర, శ్రీహరికోట ప్రసాద్ నిర్వహించారు. జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం, ప్రజాసేవకు ప్రశాంతమ్మ కట్టుబాటు ప్రశంసనీయమన్నారు. పున్నూరులో చెంచు కిషోర్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్, మొక్కల నాటిక నిర్వహించారు. ఆడంబరం లేకుండా సేవా కార్యక్రమాల రూపంలో జరిగిన వేడుకలు ప్రత్యేకతగా నిలిచాయి. గంగపట్నంలో శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయ చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం కేక్ కట్ చేశారు. కోడూరు కమలాకర్ రెడ్డి విపిఆర్ దంపతుల సేవలు చిరస్మరణీయమన్నారు. ఏకోళ్ళు పవన్ రెడ్డి, చెంచుకిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు. కుడితిపాలెంలో ప్రశాంతమ్మ చిత్రపటానికి పాలాభిషేకం, గ్రామ టిడిపి కమిటీ సన్మానాలు, విద్యార్థులకు ప్రశాంతమ్మ పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. దొడ్ల మల్లికార్జున మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రజాసేవనపై ప్రశాంతమ్మ చూపిస్తున్న కట్టుబాటు ఎంతమందికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. జగదేవిపేటలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా యువత విస్తృతంగా పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటి హరిత ర్యాలీ చేపట్టారు. మండల టిడిపి అధ్యక్షులు ఏకోళ్ళు పవన్ రెడ్డి ప్రజాసేవపై ప్రశాంతిరెడ్డి నిబద్ధత స్ఫూర్తి అని పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాముల పూజలు

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని మద్దూరు పాపిరెడ్డి నగర్‌లో వెలసియున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో నడుమూరు నడుమూరు యువసేన ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రత్యేక పూలాలంకరణలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమం అనంతరం అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉభయ దాతలుగా నడుమూరు యువసేన ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల అన్న ప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ జయప్రదానికి పిలుపు

అనంతసాగరంలో..

ప్రజాశక్తి-అనంతసాగరం : ఎస్ఆర్ఎన్‌బి (వికాస్) జూనియర్ కాలేజ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఏర్పాటు చేసి సభ్యత్వాలు చేర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు విక్రమ్ మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పడిందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై విద్యార్థులను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తుందని ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తుందన్నారు. అలాగే 28వ తేదీన నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ 47వ జిల్లా మహాసభలు జరగనున్నాయని తెలియజేశారు. ఈ మహాసభలో ఏవైతే జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు ఓ ప్రణాళిక రూపొందించుకునేందుకు వేదిక కానున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై మరింత బలంగా పోరాడేందుకు ఓ ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు ఈ ఒక మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఒక మహాసభల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామ న్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ అనంతసాగరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా టి.ప్రదీప్, మండల కార్యదర్శిగా ఆఫ్రిద్, ఉపాధ్యక్షులుగా డి.ప్రవీణ్ తేజ్, సహాయ కార్యదర్శిగా జె.హరికష్ణ, ట్రెజరర్‌గా జోయల్‌ను ఎన్నుకున్నారు.

పొదలకూరులో..

ప్రజాశక్తి-పొదలకూరు : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ 47వ నెల్లూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శనివారం మండలంలో విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను.నరేంద్ర మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై విద్యార్థులను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తుందని ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తుందన్నారు. అలాగే నవంబర్ 28వ తేదీన నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ 47వ జిల్లా మహాసభలు జరగనున్నాయని తెలియజేశారు. మహాసభల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కావలి

జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో భాగంగా నాల్గవ రోజుశనివారం కావలి శివారులోని పెంకుల ఫ్యాక్టరీ వద్ద గిరిజన కాలనీలో, కావలి చెరువు దగ్గరలోని ఎస్‌టి కాలనీలో ఆరోగ్య అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీజనల్‌గా సోకే వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆరోగ్య కార్యకర్తలు రత్నకుమారి, కోమలిదేవి, ఆశావర్కర్లు ఎస్కే.మొహిన్, వెంకటలక్ష్మి వర్షాకాలంలో చలికాలంలో ఎండాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య పరజాగ్రత్తలు అప్రమత్తతలు గురించి, కాలనీవాసులకు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లకు అవగాహన కల్పించారు. అలాగే జవహర్ భారతి డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి గ్రామస్తులకు యోగా గురించి, శారీరక పటుత్వం గురించి తెలియపరిచారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.రమణారెడ్డి దోమలు, ఈగలు వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి, వాటికి తగు సలహాలు, జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్‌లు పి.నాగేశ్వరరావు, ఎస్.కె.అయూబ్ అహ్మద్‌ల నిర్వహణలో జరిగింది. కార్యక్రమంలో జవహర్ భారతి రిటైర్డ్ కామర్స్ అధ్యాపకులు మన్నేపల్లి వెంకటేశ్వర్లు, ప్రస్తుత కామర్స్ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్.సుబ్బరాయుడు, కాలనీవాసులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొని జయప్రదం చేశారు.

యోగా చేస్తున్న విద్యార్థులు

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉదయగిరి

స్టేట్ పేట ఎబిఎం కాంపౌండ్ ఆవరణంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 60 ఏళ్లు ఉన్నట్లుగా గుర్తించి గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అతను చనిపోయిన దగ్గర గడ్డి మందు బాటిల్ కూల్ డ్రింక్స్ బాటిళ్లు ఉన్నాయి. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఉదయగిరిలో ఈ సమాచారం తెలుసుకొని ఉదయగిరి పోలీసులను కలవాలని ఎస్ఐ కోరారు. అనంతరం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులు ఉదయగిరి పోలీస్ స్టేషన్‌కు వచ్చారని ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి వారిని విచారించగా దగదర్తి మండలం చవట పుట్టేడు గ్రామానికి గ్రామ వాసి పులి.ఎర్రయ్య (75) సంవత్సరాలు కిడ్నీ సమస్యతో కొద్దిరోజులుగా బాధపడుతూ మానసిక పరిస్థితులతో రెండు రోజులు నుండి ఇంటి నుండి బయటకు వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అనంతరం ఉదయగిరి ప్రభుత్వ ఆరోగ్యా కేంద్రానికి తరలించి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మందాటి చెరువులో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కావలి

కావలి మండలం ముసునూరు గ్రామంలోని మందాడి చెరువు నీటిలో సుమారు 35-45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తిశవం బాగా ఉబ్బిపోయి చనిపోయి ఉన్నాడని ముసునూరు గ్రామ వి.ఆర్.ఒ. పి. శ్రీనివాసులు కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేశారు. సదరు రిపోర్టు మేరకు కావలి రూరల్ ఎస్.ఐ. బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రమేశ్ (37) తండ్రి శ్రీనివాసులు, బలిజ, గుప్తా నగర్, ముసునూరు గ్రామం, కావలి మండలం. భార్య విజయ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడికి మెంటల్లీగా బాధపడుతు న్నాడు. రెండు రోజులు కిందట బయటకెళ్లినట్లు భార్య తెలిపింది.

చికిత్స పొందుతూ లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విధి నిర్వహణలో గాయపడి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న లైన్‌మెన్ విజయ్ (54) శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అనంతసాగరం మండలం సంజీవ నగర్‌కు చెందిన ఈ విజయ్ ఈ నెల 11న నాగులపాడు గ్రామం వద్ద విద్యుత్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదానికి గురి కావడంతో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ మృతి చెందారు. ఆయన మృతికి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సానుభూతిని తెలిపారు.

నూతన లేబర్‌కోడ్‌లపై కార్మికవర్గాల మండిపాటు

ప్రజాశక్తి-నెల్లూరు

కార్మికులు పోరాడి సాధించుకున్న తమ హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు లాభం చేకూరే విధంగా కార్మికులను కట్టుబానిసలుగా మార్చివేసేందుకు దోహదపడే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తు ఉత్తర్వూలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్పుచేయడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు దశల వారీగా ఉద్యమాలు, పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. కార్మికుల నుంచి వ్యతిరేకత వస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా కేవలం కార్పోరేట్లకు కార్మిక చట్టాలను అనుకూలంగా మార్చివేసే విధంగా చట్టాలను రూపొందించి చట్ట సభలల్లో దొడ్డిదారిన ఆమోదింపచేసుకోని వాటిని అమలు చేయాలంటూ ఉత్తర్వూలు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఐక్యవేదికగా రూపొంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, విద్యుత్తు శాఖ కార్మికులు, ఇన్సూరెన్స్, ఉపాధ్యాయ రంగాలకు చెందిన ఉద్యోగులు, ఆటో యూనియన్ కార్మికులు, రవాణారంగం కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు చేయలంటూ విడుదల చేసిన నోటిఫై చేసిన జిరాక్స్ కాగితాలను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతే కాకుండా నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మెబాట పడుతున్నట్లు కార్మికసంఘాలు ప్రకటించాయి. మున్సిపల్ కార్మికులు గతంలో సమ్మె చేసిన సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు 19 రోజులుగా కార్మికులు నిర్వహిస్తున్నా జిల్లా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారి తీస్తోంది. కార్మికులకు సమ్మెకాలపు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రిటైర్మెంట్ అయిన కార్మికుడి ఇంటిలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రయివేట్ ట్రావెల్స్ రోడ్డు ప్రమాదాలకు గురికావడం సర్వసాధారణమైపోయింది. ప్రతి నిత్యం జిల్లాలో ఏదోక ప్రాంతంలో ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురికావడం ప్రయాణికులు గాయపడట్టం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాహన ఫిట్నెస్ సక్రమంగా లేని కారణంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయంటూ వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల రవాణా శాఖ అధికారులు నగరంలో తనిఖీలు నిర్వహించగా ఈ సమాచారం ముందుగా తెలుసుకున్న ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాలు నగరంలోని ప్రవేశించలేదు. రవాణా శాఖ నియమనిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాల యజమానులు కేవలం సంపాదనే ధ్యేయంగా పెట్టుకోని తమ ఇస్టానుసారంగా నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు. రవాణాశాఖ అధికారులు ప్రయివేట్ ట్రావెల్స్‌ను కేవలం బుకింగ్ పాయింట్ల వద్దనే కాకుండా ఇతర ప్రాంతాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే అసలు వ్యవహారం బహిర్గంతం అవుతుంది.

దీక్ష ౩౦

ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు

- హాస్టల్లోకి విష పురుగులు వస్తున్న వైనం

ప్రహరీ లేని వసతిగృహం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇందిరా కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహం ఉంది. వసతి గృహంలో సుమారు 40 మంది విద్యార్థులు నాలుగో తరగతి నుండి 9వ తరగతి వరకు జెడ్‌పిహెచ్ఎస్ ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చి అక్కడ చదువుకుంటున్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ వసతుల కోసం రూ.14లక్షల ఎన్.ఆర్.జి.సి. నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో హాస్టల్లో ఉత్తరం వైపు గోడ, ఎలక్ట్రికల్, సానిటరీ, బోరు మోటరు, పెయింటింగ్ వర్కులు బాత్రూములు మరమ్మతులు జరిగాయి. విద్యార్థులు పడుకోవడానికి సరైన వసతులు లేక కింద నేలపైన పడుకుంటున్నారు. చలికాలంలో కింద చల్లగా ఉంటుందని, పడుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోయారు. వసతి గృహంకు తూర్పు వైపున ప్రహరీ గోడ లేకపోవడంతో విష సర్పాలు లోపలకి వచ్చే అవకాశం ఉన్నాయి. కప్పరాల తిప్ప జాతీయ రహదారి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఉంది. పాఠశాలలో తూర్పు వైపున నీళ్ల పోయేందుకు రంధ్రం ఉండడంతో రంధ్రం నుండి విష సర్పం లోపలికి ప్రవేశించి పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కరవడంతో సమయానికి చికిత్స అందిచ్చి ప్రాణాలు కాపాడారు. సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంకు తూర్పు వైపున చెరువు ఉంది. చుట్టూ చిల్లచెట్లు ఉండడంతో విష పురుగులు సంచారం ఎక్కువగా ఉంటుందని స్థానికులు తెలిపారు. కోవూరుపల్లి నుండి రామస్వామి పాలెం కొచ్చే మెయిన్ రోడ్డు నుండి హాస్టల్ వరకు గ్రావెల్ రోడ్డు ఉంది. జల జీవన్ మిషన్ వాటర్ స్కీం కింద పైప్‌లైన్ వేసేందుకు రోడ్డు మధ్యలో జెసిబి సాయంతో పైపులను వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మార్గాన బురద పేరుకుపోయి విద్యార్థులు నడవలేని, పరిస్థితి ఏర్పడింది. సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వద్ద నుండి మెయిన్ రోడ్డు వరకు సిమెంట్ రోడ్డును వేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇందిర కాలనీ ప్రజలు కోరుతున్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ వసతులపై ప్రభుత్వం, జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ వసతి గృహాలలో చదివేందుకు విద్యార్థులు ముందుకురారని, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఎల్‌ఎ కృష్ణారెడ్డికి ఆహ్వానం

ఎంఎల్‌ఎకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని శ్రీ లక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫిజియోథెరపీ కాలేజీలో డిసెంబర్ 3న జరగనున్న ఫస్ట్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విచ్చేయవలసిందిగా కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రతినిధులు ఎంఎల్‌ఎకు ఆహ్వాన పత్రాన్ని అందజేసి, విద్యార్థుల తొలి పట్టాభిషేక వేడుకల్లో పాల్గొనాలని కోరారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు కాలేజీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

Before The Principal District Judge Motor Accident Claims Tribunal : Nellore

M.V.O.P.No. 367 / 2025

Indla Padma - Claimant

Vs

1. Chalamacharla Chenchamma and 2 others - Respondents

Notice

R1. Chalamcharla Chenchamma, D/o **Indla Subbaramaiah,** Owner of motor cycle No.AP-40-EA-1935, Residing at Ondurugunta, Atmakur Village and Mandal, Nellore District-524322.

R3. Kalluri Polaiah, S/o **Sreeramulu,** Rider of motor cycle No.AP-40-EA-1935, Residing at Ondurugunta, Atmakur Village and Mandal, Nellore District-524322.

పై నెంబరు కేసులో క్లెయిమెంట్ మీపై యాక్సిడెంట్ నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే10-12-2025ది** కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.శ్రీనివాసులు, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

బిటిఏ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు:ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ బడుగుబలహీన వర్గాలకు చెందిన వారేనని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ బాధ్యతను గుర్తించి విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జీవితాలకు బంగారు బాట వేయాలని బిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. శనివారం నగరంలో బిటిఏ నగర కమిటీ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిటిఏ నగర అధ్యక్షులు పెంచల ప్రసాద్ అధ్యక్షత వహించారు. చివరగా నూతన నగర కమిటీని ఎన్ను కున్నారు. నగర కమిటీ గౌరవాధ్యక్షులుగా సిహెచ్ సుబ్బరాయుడు, గౌరవ సలహా దారుడిగా మేకల భాస్కరరావు, అధ్యక్షులుగా ఎల్ పెంచలప్రసాద్, నగర అసోసియేట్ అధ్యక్షులుగా పి.రమేష్, నగర ప్రధాన కార్యదర్శిగా తలారి మల్లికార్జునలను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, బిటిఏ వ్యవస్థాపకులు నూకలపాటి రమణయ్య ,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పల్లం వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మాస పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం మాస పత్రికను, జిల్లా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా ఆవిష్క రించారు. కలెక్టరేట్‌లోని జిల్లా సమాచారశాఖ (ఐఅండ్‌పిఆర్), డిడి కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ మాస పత్రికలో కథనాలు, వార్తలు ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచురితం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మాస్త్రం ఎడిటర్ పి.దినేష్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిల పత్రికలు పనిచేస్తు న్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డివిజనల్ పిఆర్ఒ రవి, జర్నలిస్టులు రావూరు రమేష్, వైఎస్ చౌదరి పాల్గొన్నారు.

సీతారామిరెడ్డి అంతిమయాత్రలో మాజీ మంత్రులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వైసిపి సీనియర్ నాయకులు, రూరల్ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మేనకూరు సీతారామిరెడ్డి అంతిమయాత్రలో మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు.మేనకూరు సీతా రామి రెడ్డి అనారోగ్యం కారణంగా శుక్రవారం మరణించగా శనివారం బుచ్చిరెడ్డిపాలెం పెద్దూ రు లో ఆయన అంత్యక్రియల కార్యక్రమం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ఆయన అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదలకు ఎన్నో సేవలు అందించే నాయకుడు మేనకూరు సీతారామిరెడ్డి అటువంటి నాయకుడిని పోగొట్టుకోవడం పార్టీకి తీరని నష్టమని పేర్కొన్నారు.. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఆప్కాస్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, టౌన్ కన్వీనర్ షేక్ షాహుల్, పలువురు వైసిపి కౌన్సిలర్లు, కోడూరు మధుసూదన్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని ఇస్కపాలెం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివా రం పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు నోటు బుక్స్, పెన్స్ ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యు లు మరి శ్రీనివాసులురెడ్డి, గోలి శ్రీని వాసులు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ కి నిరసనగా ఈనెల 26వ తేదీన నిర్వ హిస్తున్న దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకొని శనివారం మండలం నరుకూరులో అయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రభుత్వాలు సామాన్యులకు అండ గా ఉండాలే తప్ప స్వార్థ ప్రయోజనాల కోసం కాదన్నారు. పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలిపారు. ప్రభుత్వం పెట్టుబడితో ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణమని విమర్శించారు. ఏపీలో నిరుద్యోగ సమస్య రోజురోజుకీ పెరుగుతోందని, రాష్ట్రానికి వందల కంపెనీలు వచ్చాయనడం పచ్చి అబద్ధమన్నారు. పరిశ్రమలు పెట్టడానికి అనుకూల వా తావరణం సష్టించాలి తప్ప బలవంతపు సేకరణ చే యకూడదని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఉలవ పాడు మండలం కరేడులో బలవంతపు భూసేకరణ రై తులు ప్రజలు ఐక్యంగా తిప్పి కొట్టా రన్నరన్నారు. బల వంతంగా ప్రభుత్వాలు ఏది చేయాలని చూసినా ప్రజలు ఐక్యంగా తిరగబడతారని తెలిపారు. ఈ తరుణంలో కేం ద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 29 కార్మిక చట్టాలను కుదించి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం దారుణమని తెలిపారు. ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా ఈ నెల 26వ నెల్లూరు గాంధీ బొమ్మ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ, అనంతరం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు, పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాలువలో పూడిక తీత పనులు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామంలో ప్రతేడాది వరదల సమయంలో గ్రామం నీటమునిగే ప్రమాదం ఎదురయ్యే నేపథ్యంలో, ఈసారి ముందస్తు చర్యగా తోట్ల కాలువ పూడిక తీయించే పనులు చేపట్టారు. గ్రామస్తులు ఈ సమస్యను జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డికి వినిపించగా, ఆయన సూచనలతో గ్రామ ప్రజలు కోవూరు శాసనసభ్యులు ప్రశాంతి రెడ్డికి విన్నవించారు.విన్నవించగానే ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెంటనే స్పందించి, విపిఆర్ ఫౌండేషన్ సహకారంతో హిటాచి యంత్రాన్ని ఏర్పాటు చేసి కాలువ పూడిక తీయింపు పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామంలో వరదనీరు నిల్వ ఉండే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని స్థానికులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ఎంపిటిసి యద్దలపూడి నాగరాజు కూడా ప్రాంతాన్ని పరిశీలించి, రైతులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. తోట్ల కాలువ పూడిక తీయించడం ద్వారా వరదల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుందనే విశ్వాసం గ్రామ ప్రజల్లో కనిపించింది.ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేపట్టిన వేగవంతమైన చర్యలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు నియంత్రణకు డ్రోన్ నిఘా

ప్రజాశక్తి-నెల్లూరు:జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నేరాలను నియంత్రణలో భాగంగా డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్ సౌజన్యసూచనల మేరకు, సంబంధిత డిఎస్‌పిల ఆధ్వర్యంలో ఆయా పోలీసు స్టేషన్ల సిఐ, ఎస్‌ల సమక్షంలో డ్రోన్ తో, నగర, రూరల్, శివారు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా పట్టణ సమీప ప్రాంతాలలో ప్రత్యేక దష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డు కట్టు వేస్తున్నారు. నేర నియంతరనే లక్ష్యంగా క్రైమ్ ప్రోన్ ఏరియాల పై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి కార్యకలాపాలను గుర్తించి కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా పోలీసు శాక తగిన చర్యలు చేపట్టంది. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిరంతర నిఘా ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నారు. ఎవరైన చట్ట వ్యతిరేక,క్రిమినల్ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు శాఖ హెచ్చరిస్తుంది. జిల్లా పోలీసులు. ఎవరికైనా అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కి సమాచారం అందజేయాలని ప్రజలకు పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తుంది.

రేపు జిల్లాకు రానున్న చైర్మన్ లంక దినకర్

ప్రజాశక్తి-నెల్లూరు:

20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ సోమవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 24న మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ నుండి వందే భారత్ రైలు (20678)లో బయలుదేరి సాయంత్రం 6.04 గంటలకు నగరానికి చేరుకోని స్థానిక గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న..ఆరోగ్య, విద్య రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు, అమత్ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధాన్ మంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతి తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యా హ్నం 1.00 గంటకు మీడియా సమావేశం నిర్వహిస్తా రన్నారు. ఈ కార్యక్రమానంతరం మధ్యా హ్నం 3.00 గంటలకు నగరం నుంచి చెన్నైకి కారులో బయలుదేరి రాత్రి 7.00 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- నెల్లూరు సంక్షేమం

కాలేజీ విద్యార్థి, విద్యార్థినులకు కెరియర్ గార్డెన్స్ అవసరమని ఐక్యవేదికను బీసీ వెల్ఫేర్ అధికారి పి.వెంకట లక్ష్మమ్మ రావుస్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్ దశనుండే వారు కెరియర్ ప్రోగ్రాంను ఎంచుకోవాలన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థి దశ నుంచి ఏ కోర్సులో చేరాలన్నది నిర్ణయించు కోవాలన్నారు. ఎంచుకున్న గ్రూపులకు సంబంధించి భవిష్యత్తు ప్రణాళికను నిర్దేశించు కోవాలని విద్యార్థులకు సూచిం చారు. వివిధ కోర్సులకు సంబంధించిన భవిష్యత్తు అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్ కుమార్,

మాట్లాడుతున్న బిసి వెల్ఫేర్ అధికారి

వరప్రసాద్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రి ఆనం

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేడు జిల్లా పరిధిలో పలు దేవాలయాల్లో పూజాకార్యక్రమాలు, శంకుస్థాపనలు, అభివద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరం నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించి ఉదయం 9 గంటలకు పెంచలకోనకు చేరుకోని పెనుశిల లక్ష్మినరసింహస్వామిని దర్శించుకుంటా రన్నారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, దేవాలయ ప్రాంగణంలో అనివేటి మండపం నిర్మాణానికి వెంకటగిరి ఎంఎల్ఏ తో కలసి శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పెంచలకోన నుంచి బయలు దేరి ఆత్మకూరుకు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటారన్నారు. ఆత్మకూరులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 1.00 గంటలకు సంగం గాంధీ జనసంగం సమీపంలోని జాతీయ రహదారి వద్ద స్థానికంగా ఏర్పాటు చేసిన అభివద్ధి కార్యక్రమాలలో పాల్గొని, మధ్యాహ్నం 1.30 నగరానికి చేరుకుంటారన్నారు. సాయంత్రం 5.00 గంటలకు సంజాపేటలోని శ్రీ వెంకటమ్మ పెరంటాల దేవస్థానంలో రాజగోపురం మహా మండపం నిర్మాణ పనులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తో కలసి శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా ఎంఎల్ఏ ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కొడవలూరు: మండలంలోని టపా తోపు ఎస్‌టి కాలనీ లో కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌సిసెల్ మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, యువకులు, చిన్నారులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు ప్రజాసేవకే ప్రధాన లక్ష్యం పెట్టుకొని రాజకీయాల్లోకి ప్రవేశించి, తక్కువ సమయంలోనే ప్రజల్లో విశేష ఆదరణ పొందారని గుర్తించారు.కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మయూరి సిద్ధార్థ, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తువ్వర ప్రవీణ్ కుమార్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కలిచేసి హరినాథ్ రెడ్డి, తెలుగు యువత నాయకుడు తాతా జగదీష్, పార్లపల్లి నీటి సంఘం అధ్యక్షుడు పుల్ల గంగాధర్, గ్రామ పార్టీ నాయకులు సూరి నవీన్, దానం సుధీర్, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినం వేడుకలు విడవలూరు టిడిపి, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కోవూరు మండల కేంద్రంలో తెలుగుయువత ఆధ్వర్యంలో మెడికవర్, జయభారత్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరంలో పాటు 130 మంది రక్తదానం చేశారు. విడవలూరు మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు ఏటూరి శ్రీహరి రెడ్డి, టీడీపీ నేతలు అడపాల శ్రీహరి రెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి ఆధ్వర్యంలో 106 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ టీడీపీ నాయకులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశయాలకు అనుగుణంగా భాగంగా ఆడంబరాలకు దూరంగా ఆమె జన్మదినం సందర్భంగా మొక్కలు నాటడం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.